రాజకీయ క్రీడలో అధికారి ఔట్!

అధికార పార్టీ నాయకుల ఒత్తిడితో మేడ్చల్ కమిషనర్ దీర్ఘకాలిక సెలవు



మేడ్చల్ మున్సిపల్ కార్యాలయం

మేడ్చల్: మేడ్చల్ మున్సిపాలిటీలో చైర్‌పర్సన్, కౌన్సిలర్లు ఆడిన రాజకీయ క్రీడలో కమిషనర్ అవుట్ అయ్యారు. చైర్‌పర్సన్ లక్ష్యంగా సాగిన ఈ రాజకీయ క్రీడలో కౌన్సిలర్ల బంతికి చైర్‌పర్సన్ కాకుండా కమిషనర్ చిక్కాడు. ఆరు నెలలుగా మేడ్చల్ మున్సిపాలిటీలోని అధికార పార్టీలో 16 మంది కౌన్సిలర్లు, చైర్‌పర్సన్ దీపికానర్సింహారెడ్డి మధ్య రాజకీయ అగాధం ఏర్పడింది. 16 మంది బీఆర్‌ఎస్ కౌన్సిలర్లు చైర్‌పర్సన్, కమిషనర్ అహ్మద్ షఫిఉల్లా ఏకమై అభివృద్ధి పనులు చేయకుండా అవినీతికి పాల్పడుతున్నారని విమర్శిస్తూ చైర్‌పర్సన్‌పై అవిశ్వాసం నోటీసు ఇచ్చారు. ఆరు నెలలుగా మేడ్చల్ మున్సిపాలిటీ కౌన్సిలర్లు రెండు వర్గాలుగా విడిపోయి రాజకీయాలు చేస్తున్నారు. కొందరు వైస్ చైర్మన్ గ్రూపులో ఉండగా, మరి కొందరు చైర్‌పర్సన్ గ్రూపులో చేరారు. చైర్‌పర్సన్‌పై అవిశ్వాస తీర్మాణం నోటీసులు ఇవ్వగా రెండో డిమాండ్ కింద కమిషనర్‌ను బదిలీ చేయాలని పట్టుబట్టారు. కమిషనర్ చైర్‌పర్సన్‌తో కుమ్మక్కై, తమను ఖాతరు చేయడం లేదని, ఆయన్ను బదిలీ చేయాలని అధిష్టానం వద్ద పట్టుబట్టి కూర్చున్నారు.

మంత్రి ఇంట్లో సమావేశంతోనే...

మేడ్చల్ మున్సిపాలిటీలో సమావేశాలు నిర్వహిస్తే తరుచూ రచ్చ చేస్తున్నారని, మీడియా ముంగిట అసమ్మతి వెళ్లగక్కుతున్నారని మంత్రి మల్లారెడ్డి చైర్‌పర్సన్, అధికారులు, కమిషనర్, అధికార పార్టీ కౌన్సిలర్లతో తమ ఇంట్లో రెండు రోజుల క్రితం రహస్య సమావేశం నిర్వహించారు. అవిశ్వాసం విషయం చట్ట పరిధిలో ఉండటంతో అది పక్కన పెట్టి అసమ్మతి కౌన్సిలర్ల వాదనను మంత్రి విన్నారు. తమకు విలువ ఇవ్వని కమిషనర్ అహ్మద్ షఫిఉల్లాను బదిలీ చేయాలని గట్టిగా వాదించడం, ఒక్కసారిగా బదిలీ చేసే అధికారం లేకపోవడంతో మంత్రి మల్లారెడ్డి ఇక్కడ రాజకీయం ప్రదర్శించారు. కౌన్సిలర్ల డిమాండ్ మేరకు కమిషనర్ అహ్మద్ షఫిఉల్లా వెళ్లిపోవాలని మంత్రి ఆదేశించినట్లు సమాచారం. బదిలీకి వెంటనే ఆస్కారం లేకపోవడంతో కమిషనర్ 15 రోజుల పాటు సెలవు పెట్టి వెళ్లిపోయారు.

చట్ట ప్రకారమే నడుచుకుంటానంటూ..

సెలవులపై వెళ్లిన కమిషనర్ అహ్మద్ షఫిఉల్లా ముక్కుసూటిగా మాట్లాడే అధికారిగా మేడ్చల్‌లో తన ముద్ర వేశారు. ప్రతి విషయంలో తాను చట్ట ప్రకారం నడుచుకుంటానని, అన్ని పనులను ఆ ప్రకారంగానే చేస్తానని బల్ల గుద్ది చెప్పేవాడు. ఎవరికి అనుకూలంగా ఉండకుండా తన దైన శైలిలో పనిచేసి ఆఖరుకు సెలవు పెట్టే వరకు తెచ్చుకున్నాడు. తనపై ఆరోపణలు చేసిన కౌన్సిలర్లకు ఆయన గతంలో మున్సిపల్ కార్యాలయంలోనే నాపై ఆరోపణలు చేసిన వారికి నేను సమాధానం చెప్పాల్సిన అవసరం లేదని, ఏది ఉన్నా తాను ఉన్నతాధికారులకు చెప్పుకుంటానని మీడియా ముందు తేల్చి చెప్పాడు. అధికార పార్టీ నాయకులు, కౌన్సిలర్లకు అండగా ఉండకపోవడంతో ప్రభుత్వ అధికారి తనకు ఇష్టం, అవసరం లేకున్నా దీర్ఘకాలిక సెలవుపై వెళ్లాల్సి వచ్చింది. రాజకీయ నాయకుల క్రీడలో ఓ అధికారి సెల్ఫ్ అవుట్ అవ్వడం స్థానిక ప్రజలను ఆశ్చర్యానికి గురిచేస్తోంది.

క్లుప్తంగా

ఆలయ పునర్నిర్మాణానికి భూమి పూజ


భూమి పూజ చేస్తున్న మంత్రి మల్లారెడ్డి

మల్లాపూర్: నాచారం ఈఎస్‌ఐ ఆస్పత్రి ఆవరణలో ఉన్న కనకదుర్గమ్మ ఆలయ పునః నిర్మాణానికి ఉప్పల్ ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డితో కలిసి మంత్రి మల్లారెడ్డి భూమి పూజ చేశారు. అనంతరం ఆస్పత్రిలోని మెడికల్ స్టోర్‌ను తనిఖీ చేశారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ మెతే శ్రీలతాశోభన్‌రెడ్డి, సూపరింటెండెంట్ కమల, ఈఎస్‌ఐ బోర్డు మెంబర్ వేముల మారయ్య తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ మహిళా నేతకు మాజీ మేయర్ పరామర్శ



కుషాయిగూడ: ఏఎస్‌రావునగర్ డివిజన్ బీఆర్‌ఎస్ మహిళా అధ్యక్షురాలు కైప శిరీషారెడ్డి కుమారుడు ప్రణీత్‌రెడ్డి ఆత్మహత్య పట్ల మాజీ మేయర్ బొంతు రాంమోహన్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఆయన శిరీషారెడ్డిని పరామర్శించి ధైర్యం చెప్పారు. ఆయన వెంట మాజీ కార్పొరేటర్ గొల్లూరి అంజయ్య, బీఆర్‌ఎస్ నాయకులు రెగ్గల్ల సతీష్‌రెడ్డి, బాలనరసింహ, నాగేశ్వర్‌రెడ్డి, శివకుమార్ తదితరులు ఉన్నారు.

ఇండస్ట్రీస్ అసోసియేషన్ అధ్యక్షుడిగా దినేష్‌కుమార్

మల్లాపూర్: నాచారం ఇండస్ట్రీస్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అసోసియేషన్ అధ్యక్షుడిగా దినేష్‌కుమార్ జైన్, ఉపాధ్యక్షుడిగా శివ, కార్యదర్శిగా సురేందర్‌రెడ్డి తదితరులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా దినేష్‌కుమార్ జైన్ మాట్లాడుతూ.. నాచారం ఇండస్ట్రీస్ అభివృద్ధి కోసం కృషి చేస్తానన్నారు. ప్రభుత్వం పరిశ్రమలకు అందజేస్తున్న ప్రోత్సాహకాలపై అవగాహన కల్పిస్తామన్నారు.

‘కనీస వేతన జీవోలను సవరించాలి’

మల్లాపూర్: కనీస వేతన జీవోలను రాష్ట్ర ప్రభుత్వం సవరించి కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్ డిమాండ్ చేశారు. నాచారం చౌరస్తాలో సీఐటీయూ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా చంద్రశేఖర్ మాట్లాడుతూ.. ప్రభుత్వం కార్మికులకు డబుల్ బెడ్‌రూం ఇళ్లు కేటాయించి ఆదుకోవాలన్నారు. కార్యక్రమంలో సత్యంగౌడ్, అబ్దుల్లా, బాబు, శ్రీనివాస్, బాబురెడ్డి, ఉపేందర్, పల్లవి పాల్గొన్నారు.

చిన్నారులకు గ్రాడ్యుయేషన్ డే


నృత్యం చేస్తున్న చిన్నారులు

అల్వాల్: వెంకటాపురంలోని లిటిల్ ఫ్లవర్ ఉన్నత పాఠశాలలో ప్రీ ప్రైమరీ విద్యార్థులకు నిర్వహించిన గ్రాడ్యుయేషన్ డే వేడుకలు ఆకట్టుకున్నాయి. లిటిల్ ఫ్లవర్ విద్యా సంస్థల చైర్మన్ డాక్టర్ కె.సదానంద్, ప్రిన్సిపాల్ కె.జ్యోతి, వెంకటాపురం బ్రాంచ్ ప్రధానోపాధ్యాయురాలు నాగజ్యోతి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం కొనసాగింది. ఈ సందర్భంగా చిన్నారులు ఆట పాటలతో సందడి చేశారు.

బచ్‌పన్ అకాడమీ హైట్స్‌లో..

మల్లాపూర్: నాచారం బచ్‌పన్ అకాడమీ హైట్స్ పాఠశాలలో శనివారం గ్రాడ్యుయేషన్ డే వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. పాఠశాల డైరెక్టర్ శివకుమార్, కరస్పాండెంట్ కల్పన, ప్రిన్సిపాల్ రష్మీ జైశ్వాల్ పాల్గొని విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేశారు.

వక్ఫ్‌బోర్డు బాధితుల సమస్యను పరిష్కరించాలి

బోడుప్పల్: రాష్ట్రంలో బీఆర్‌ఎస్ అధికారంలో ఉన్నంతకాలం బోడుప్పల్‌లోని వక్ఫ్‌బోర్డు బాధితుల సమస్య పరిష్కారం కాదని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ అన్నారు. మారుతీనగర్ కాలనీలో వక్ఫ్ బోర్డు బాధితుల గోస-బీజేపీ భరోసా పేరుతో నిర్వహించిన దీక్షకు ఆయన హాజరై మాట్లాడారు. తాము అధికారంలోకి వస్తే ఈ సమస్యను పరిష్కరిస్తామని చెప్పారు. మూసేసిన ఫైనాన్స్ కంపెనీకి కొత్త పేరు పెట్టినట్లు టీఆర్‌ఎస్‌ను బీఆర్‌ఎస్‌గా మార్చారని బండి సంజయ్ ఎద్దేవా చేశారు.

వీధి కుక్కల నియంత్రణకు చర్యలు తీసుకోండి


వెటర్నరీ అధికారితో మాట్లాడుతున్న కార్పొరేటర్ శ్రవణ్

మల్కాజిగిరి: వీధి కుక్కల నియంత్రణకు చర్యలు తీసుకోవడంలో అధికారులు విఫలమయ్యారని మల్కాజిగిరి కార్పొరేటర్ శ్రవణ్ అన్నారు. జీహెచ్‌ఎంసీ చీఫ్‌ఎవెటర్నరీ అధికారి డాక్టర్ అబ్దుల్ వకీల్‌ను కలిసి కుక్కల నియంత్రణకు చర్యలు తీసుకోవాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. మల్కాజిగిరిలో వీధి కుక్కలు పెరిగిపోతున్నాయని, వాటితో ఇబ్బందులు పడుతున్నట్లు ప్రజల నుంచి ఫిర్యాదులు అందుతున్నాయన్నారు. గతంలోనూ పలు చోట్ల వీధి కుక్కలు దాడిలో చిన్నారులు గాయపడిన ఘటనలు ఉన్నాయని ఆయన అన్నారు. జీహెచ్‌ఎంసీ అధికారుల తీరు సరిగా లేదని, వెంటనే స్పందించి కార్పొరేటర్లతో సమావేశం నిర్వహించాలని కోరారు.

రాష్ట్ర ప్రభుత్వ అవినీతిపై పోరాటం చేయండి


కార్యక్రమంలో మాట్లాడుతున్న బాల్‌లింగం

అల్వాల్: రాష్ట్ర ప్రభుత్వ అవినీతిపై పార్టీ కార్యకర్తలు పోరాటం చేయాలని బీజేపీ నేత ఎం.బాల్‌లింగం సూచించారు. శనివారం మచ్చబొల్లారం డివిజన్ ఎంజీనగర్‌లో స్ట్రీట్ కార్నర్ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ.. ప్రజలతో మమేకమవుతూ వారి సమస్యల పరిష్కారం కోసం కృషి చేయాలన్నారు. ఎంజీనగర్ మోత్కుల కుంట డ్రైనేజీ సమస్య పరిష్కారం కోసం అధికారులపై ఒత్తిడి తీసుకురావాలని సూచించారు. కార్యక్రమంలో ఈ శక్తి కేంద్రం ఇన్‌చార్జి శ్రీకాంత్, బూత్ కమిటీ అధ్యక్షుడు శివప్రవీణ్, ఓబీసీ మోర్చా ప్రచార కార్యదర్శి దండుగుల వెంకటేష్, డివిజన్ అధ్యక్షులు ప్రకాష్‌చౌదరి, వినయ్‌భాస్కర్, తిరుపతిరెడ్డి, గోపి తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరానికి స్పందన

బోడుప్పల్: బోడుప్పల్‌లోని గ్లోబల్ చాంప్స్ స్కూల్‌లో లయన్స్ క్లబ్ ఇంటర్నేషల్ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన ఉచిత నేత్ర వైద్య శిబిరానికి మంచి స్పందన లభించిందని జోన్ చైర్‌పర్సన్ లయన్ సీహెచ్ కామేశ్వరి తెలిపారు. పేద, మధ్య తరగతి ప్రజలకు సేవ చేయడంలో లయన్స్ క్లబ్ ఎప్పుడూ ముందుంటుందన్నారు. 250 మందికి పైగా ప్రజలు వైద్య పరీక్షలు చేయించుకున్నారని ఆమె చెప్పారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ప్రతినిధులు తరంగిణి, కోటేశ్వరరావు, అబ్రహం లింకన్, వలివేటి రాధాకృష్ణ, రాజు, జైపాల్‌రెడ్డి, మురళీధర్, రఘుపతిరెడ్డి పాల్గొన్నారు.


కంటి పరీక్షలు చేస్తున్న వైద్యులు

విద్యార్థులపై తల్లిదండ్రులు శ్రద్ధ తీసుకోవాలి


సమావేశంలో మాట్లాడుతున్న పాఠశాల విద్య సంచాలకులు దేవసేన

అల్వాల్: విద్యార్థుల పట్ల వారి తల్లిదండ్రులు శ్రద్ధ తీసుకోవాలని పాఠశాల విద్య సంచాలకులు దేవసేన, మేడ్చల్ జిల్లా విద్యాశాఖ అధికారి విజయకుమారి, సెక్టోరల్ అధికారి రవీందర్‌రాజు అన్నారు. శనివారం యాప్రాల్‌లోని కౌకూర్ జిల్లా పరిషత్ పాఠశాలలో పేరెంట్స్, టీచర్ మీటింగ్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వారు ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడుతూ.. విద్యార్థులు తమకు నచ్చిన రంగంలో రాణించేందుకు వారి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు ప్రోత్సహించాలన్నారు. కౌకూర్ పాఠశాలలో విద్యార్థులకు అనువైన వాతావరణం ఉందని చెప్పారు. ప్రధానోపాధ్యాయుడు, ఉపాధ్యాయులు విద్యార్థుల భవిష్యత్ కోసం కృషి చేస్తున్నారని ప్రశంసించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మురళీక్రిష్ణమూర్తి, పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ ఏసుమణి, ఉపాధ్యాయులు దశరథ్, రవీందర్‌రెడ్డి, నర్సింహ, పారిజాత, రమ తదితరులు పాల్గొన్నారు.

దోమల నివారణకు చర్యలు తీసుకుంటున్నాం

మేడిపల్లి: దోమల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని పీర్జాదిగూడ మేయర్ జక్క వెంకట్‌రెడ్డి తెలిపారు. శనివారం పీర్జాదిగూడలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. మూసీ పరివాహక ప్రాంతానికి ఆనుకుని ఉన్న ప్రజలు వ్యాధుల బారిన పడకుండా చూస్తామన్నారు. చెరువులు, కుంటలు, మురికి కాలువల సమీపంలో నివసించే వారిని దోమల బారినుంచి కాపాడేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడించారు. చెరువుల్లో గుర్రపు డెక్క తొలగించడంతో పాటు డ్రోన్లతో దోమల మందు పిచికారీ చేస్తామని చెప్పారు. చెరువులను సుందరీకరించి ఆహ్లాదకరమైన వాతావరణం కల్పిస్తామని ఆయన పేర్కొన్నారు.

‘మేయర్‌పై విమర్శలు చేస్తే సహించేది లేదు’

ఉప్పల్: నగర మేయర్ గద్వాల విజయలక్ష్మిపై సినీ దర్శకుడు రామ్‌గోపాల్ వర్మ విమర్శలు చేస్తే సహించేది లేదని కార్పొరేటర్ బన్నాల గీత ప్రవీణ్, మాజీ కార్పొరేటర్ జ్యోత్స్న అన్నారు. ఇటీవల అంబర్‌పేటలో వీధి కుక్కల దాడిలో చిన్నారి మృతిచెందిన ఘటనపై ప్రభుత్వం స్పందించి కుక్కల నియంత్రణకు చర్యలు తీసుకుంటుందని చెప్పారు. శనివారం ఉప్పల్ ప్రెస్ క్లబ్‌లో వారు మాట్లాడుతూ.. ట్విట్టర్ వేదికగా మేయర్‌ను విమర్శించడం సరికాదన్నారు. మహిళలను తక్కువ చేసి మాట్లాడినా, మేయర్‌ను విమర్శించినా నగరంలో తిరగనిచ్చేది లేదని వారు హెచ్చరించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ సీనియర్ నాయకులు బన్నాల ప్రవీణ్‌ముదిరాజ్, గంధం నాగేశ్వర్‌రావు, కొండల్‌రెడ్డి, జగన్ తదితరులు పాల్గొన్నారు.

రాంరెడ్డినగర్‌లో కార్పొరేటర్ పర్యటన


రాంరెడ్డినగర్‌లో పర్యటిస్తున్న కార్పొరేటర్ చేతన

హబ్సిగూడ: హబ్సిగూడ డివిజన్ పరిధిలోని రాంరెడ్డినగర్‌లో డ్రైనేజీ సమస్య అధికంగా ఉందని కాలనీవాసులు ఫిర్యాదు చేయగా శనివారం కార్పొరేటర్ కక్కిరేని చేతన హరీష్ అధికారులతో కలిసి అక్కడ పర్యటించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కాలనీలో డ్రైనేజీ సమస్యను తక్షణమే పరిష్కరించాలని అధికారులకు సూచించారు. మరోసారి సమస్య ఉత్పన్నం కాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకుడు చెల్లోజు ఎల్లాచారి, స్థానికులు నాగరాజు, శివ తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్తలకు పార్టీ అండగా ఉంటుంది


బాధిత కుటుంబ సభ్యులకు బీమా చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే సుభాష్‌రెడ్డి

ఎమ్మెల్యే సుభాష్‌రెడ్డి

ఉప్పల్: బీఆర్‌ఎస్ కార్యకర్తలకు పార్టీ అండగా ఉంటుందని ఉప్పల్ ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి పేర్కొన్నారు. ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన పార్టీ కార్యకర్త ఉప్పల్ బీరప్పగడ్డకు చెందిన పి.మహేష్ కుటుంబానికి శనివారం రూ.రెండు లక్షల ఇన్సూరెన్స్ చెక్‌ను చిలుకానగర్ కార్పొరేటర్ బన్నాల గీత ప్రవీణ్‌ముదిరాజ్‌తో కలిసి అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. సామాన్య కార్యకర్తలకు పార్టీలో సముచిత స్థానం లభిస్తుందన్నారు. పార్టీకి, ప్రజలకు సేవలందించిన నాయకులకు ఉన్నత స్థానం కల్పిస్తామన్నారు. సంక్షేమ ఫలాలు అర్హులందరికీ అందేవిధంగా చూడాల్సిన బాధ్యత కార్యకర్తలపై ఉందన్నారు. కార్యక్రమంలో బన్నాల ప్రవీణ్‌ముదిరాజ్, పులి జగన్, పల్లె నర్సింగ్‌రావు, కోకుండ జగన్, పండ్ల కిషన్, వెంకటేశ్వరరెడ్డి, గడ్డం రవి, బింగి శ్రీనివాస్, బాలు తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలి

మల్లాపూర్: రాష్ట్రంలో బీఆర్‌ఎస్ పాలనను అంతం చేసే వరకూ ప్రతి కార్యకర్త సైనికుడిలా పని చేయాలని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యాక్షుడు, మాజీ ఎమ్మెల్యే ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్ అన్నారు. శుక్రవారం రాత్రి నాచారం రాఘవేంద్రనగర్‌లో శక్తి కేంద్రం ఇన్‌చార్జి, బీజేపీ జిల్లా అర్బన్ అధికార ప్రతినిధి గోపాల్‌గౌడ్ ఆధ్వర్యంలో ప్రజా గోస-బీజేపీ భరోసా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభాకర్ మాట్లాడుతూ.. రాష్ట్ర అభివృద్ధిని వదిలేసి సీఎం ఆస్తులు పోగేసుకుంటున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో కిసాన్ మోర్చా ఉపాధ్యక్షులు రాగిరి మోహన్‌రెడ్డి, అనితాపద్మారెడ్డి, డివిజన్ అధ్యక్షులు ప్రకాష్, కాంత్రికుమార్, వెంకట్‌నాయక్, సురేందర్ తదితరులు పాల్గొన్నారు.

మల్లాపూర్ చౌరస్తాలో..

మల్లాపూర్ శివహోటల్ చౌరస్తాలో బీజేపీ కార్నర్ మీటింగ్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బీజేపీ సీనియర్ నేత కేశవరం ఆంజనేయులు హాజరై మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని కార్యకర్తలకు సూచించారు. డివిజన్ అధ్యక్షుడు నరేందర్‌రెడ్డి, అచ్చగోని సతీష్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మట్లాడుతున్న ప్రభాకర్

రాష్ట్రంలో అవినీతి పాలన..

మౌలాలి: రాష్ట్రంలో అవినీతి పాలన కొనసాగుతుందని కార్పొరేటర్ గున్నాల సునీతాశేఖర్‌యాదవ్ అన్నారు. శనివారం మౌలాలి డివిజన్ షఫీనగర్‌లో శక్తి కేంద్రం ఇన్‌చార్జ్ కాసుల శివకుమార్‌గౌడ్ ఆధ్వర్యంలో ప్రజా గోస-బీజేపీ భరోసా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆమె పాల్గొని కార్యకర్తలకు పలు సూచనలు చేశారు. చంద్రశేఖర్ యాదవ్, పలువురు బూత్ అధ్యక్షులు పాల్గొన్నారు.

అనారోగ్యంతో బాధపడుతున్న వ్యక్తి మృతి

మల్లాపూర్: నాచారం పోలీస్‌స్టేషన్ పరిధిలోని వేర్వేరు ప్రాంతాల్లో శనివారం ఇద్దరు మృతిచెందారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. నాచారం బాబానగర్‌కు చెందిన టి.అనిల్‌కుమార్(53) కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. ఒంటరిగా నివసిస్తున్న అతడికి మద్యం తాగే అలవాటు ఉందన్నారు. అయితే అతడి ఇంట్లో నుంచి దుర్వాసన వస్తుండడంతో కొంత మంది పోలీసులకు సమాచారం ఇచ్చారు. మృతదేహాన్ని గాంధీ ఆస్పత్రికి తరలించిన పోలీసులు మృతుడి భార్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఉరేసుకొని వ్యక్తి ఆత్మహత్య

మానసిక స్థితి సరిగా లేని వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన నాచారం బాపూజీనగర్‌లో చోటుచేసుకుంది. పోలీసుల వివరాల మేరకు.. పందుగల ప్రేమ్‌కుమార్‌కు కొంత కాలంగా మానసిక స్థితి సరిగా ఉండడం లేదు. ఈ నేపథ్యంలో శనివారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు నాచారం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

‘ప్రజాప్రతినిధులు హామీలు నెరవేర్చడం లేదు’


యాత్రలో పాల్గొన్న కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు

రామంతాపూర్: రామంతాపూర్ పరిధిలోని సత్యానగర్‌లో శనివారం నియోజకవర్గ కాంగ్రెస్ ఏ-బ్లాక్ అధ్యక్షుడు మందముల్ల పరమేశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో జోడో యాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా పరమేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ.. మాజీ ఎమ్మెల్యే, ప్రస్తుత బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే రామంతాపూర్ ప్రజలకు మోసపూరిత వాగ్దానాలు చేసి నెరవేర్చలేదన్నారు. రైతుబజార్ ఏర్పాటు చేస్తామని మంత్రి హరీష్‌రావుతో కలిసి స్థానిక ప్రజాప్రతినిధులు రెండుసార్లు శంకుస్థాపన చేశారని, కుల సంఘాలకు స్థలాలు కేటాయిస్తామని వాగ్దానం చేసి మర్చిపోయారన్నారు. కార్యక్రమంలో టీపీసీసీ ప్రతినిధి మహ్మద్ తోఫిక్, గిరిబాబు, రఫీక్, కృష్ణ, రఘుపతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వృద్ధుడి అదృశ్యం


బుచ్చిరెడ్డి

మేడిపల్లి: ఇంటి నుంచి బయటకు వెళ్లిన వృద్ధుడు అదృశ్యమైన ఘటన శనివారం మేడిపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. పర్వతాపూర్ రాంనగర్‌లో నివాసం ఉండే వాసుదేవ్ రెడ్డి తండ్రి బుచ్చిరెడ్డి (68) ఈ నెల 15న ఇంట్లో చెప్పకుండా బయటకు వెళ్లాడు. తిరిగి ఇంటికి రాకపోవడంతో ఆయన కుటుంబ సభ్యులు పలు ప్రాంతాల్లో వెతికారు. ఫలితం లేకపోవడంతో మేడిపల్లి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఆకట్టుకున్న వైజ్ఞానిక ప్రదర్శన

అల్వాల్: అల్వాల్‌లోని త్రివేణి పాఠశాలలో శనివారం సైన్స్ ఉత్సవ్-యాన్యువల్ సైన్స్ ఇంపోజియం-2023 నిర్వహించారు. ఈ సందర్భంగా యూకేజీ నుంచి 5వ తరగతి విద్యార్థులు రూపొందించిన దాదాపు 300 ప్రాజెక్టులను ప్రదర్శనలో ఉంచారు. ఈ కార్యక్రమానికి తెలంగాణ సైన్స్ ఫెయిర్ అకాడమీ వైస్ ప్రెసిడెంట్ గాంధారి ప్రభాకర్ హాజరై ప్రదర్శనను ప్రారంభించి తిలకించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులకు వారి ప్రాథమిక తరగతుల నుంచి సైన్స్ పట్ల అవగాహన కల్పిస్తూ ఇలాంటి ప్రదర్శనలు నిర్వహించడం అభినందనీయమన్నారు. త్రివేణి విద్యా సంస్థల సైన్స్ అధికారి సుబ్బారావు, పాఠశాల వైస్ ప్రిన్సిపాల్ సుధ, జోనల్ అకడమిక్ ఇన్‌చార్జి చక్రి తదితరులు పాల్గొన్నారు.


విద్యార్థులు రూపొందించిన నమూనాలు

సాయిరాం కాన్వెంట్ హైస్కూల్‌లో..

హబ్సిగూడ: హబ్సిగూడ డివిజన్ వెంకట్‌రెడ్డినగర్‌లోని సాయిరాం కాన్వెంట్ హైస్కూల్‌లో శనివారం వైజ్ఞానిక ప్రదర్శన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఉప్పల్ ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి హాజరై నమూనాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వైజ్ఞానిక ప్రదర్శనలతో విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథం పెరుగుతుందన్నారు. పాఠశాల కరెస్పాండెంట్ బుచ్చిరెడ్డి, బీఆర్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు.